క్లుప్తంగా

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



తిరుపతి మంగళం: రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం తన నివాసంలో దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం నుంచి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. తిరుపతి ఎస్టీవీనగర్‌కు చెందిన రాజ్‌కుమార్, సత్యనారాయణపురానికి చెందిన వి.వసుంధర, నెహ్రూనగర్‌కు చెందిన చంద్రకుమార్, ప్రసన్నకు రూ.1.70 లక్షలు మంజూరైంది.

పసికందుకు శస్త్ర చికిత్స



మాట్లాడుతున్న డాక్టర్ వంశీకృష్ణ

తిరుపతి తుడా: తొమ్మిది నెలల పసికందుకు అపెండెక్స్ శస్త్ర చికిత్సను విజయవంతంగా చేసినట్టు అంకుర హాస్పిటల్ ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. జాస్విక్ అనే తొమ్మిది నెలల పసికందు వారం రోజులుగా ఏడుస్తుండడంతో తల్లిదండ్రులు తమ ఆసుపత్రికి తీసుకువచ్చారని తెలిపారు. స్కానింగ్ చేయడంతో కడుపులో చీము పట్టినట్లు గుర్తించామన్నారు. దాన్ని తొలగించేందుకు శస్త్ర చికిత్స చేస్తుండగా బాలుడు అపెండిక్యులర్ పెర్ఫొరేషన్ సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించామన్నారు. పేగు భాగం పూర్తిగా చిట్లిపోయిందని తెలిపారు. తాను, పీడియాట్రిక్ డాక్టర్ విటల్ మోహన్, డాక్టర్ పృథ్వీ, డాక్టర్ దినేష్ కలిసి చిన్నారికి శస్త్ర చికిత్సను విజయవంతంగా చేసినట్టు వివరించారు. ప్రస్తుతం జస్విక్ కోలుకున్నాడని తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని శుక్రవారం హిమాచల్‌ప్రదేశ్ డిప్యూటీ సీఎం ముఖేష్ అగ్నిహోత్రి, తెలంగాణ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి దర్శించుకున్నారు. వారికి అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

రేపు కోటి గీత లేఖన యజ్ఞం

తిరుపతి కల్చరల్: ఇస్కాన్ మందిరంలో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 వరకు కోటి గీత లేఖన యజ్ఞం చేపడుతున్నట్లు మధ్య మండలి కోటి గీతలేఖన యజ్ఞం ప్రోగ్రాం కన్వీనర్ కొత్తపల్లి అజయ్‌కుమార్, తిరుపతి బ్రాహ్మణ సమాజం అధ్యక్షుడు భీమాస్ బాలాజీ తెలిపారు. వారు శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో యజ్ఞం పోస్టర్లు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ భగవద్గీత విశిష్టతను, భారతీయ సంస్కృతిని ప్రపంచానికి చాటాలనే సంకల్పంతో ఉడిపి పుత్తిగె మఠం సుగుణేంద్రతీర్థ స్వామీజీ, ఉత్తరాధికారి సుశ్రీంద్ర తీర్థస్వామీజీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా కోటి గీత లేఖన యజ్ఞం చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కోటి మందితో భగవద్గీత శ్లోకాలు రాయించి సమర్పింపజేయనున్నట్టు తెలిపారు. కోటి గీతలేఖన యజ్ఞం ప్రోగ్రాం కో కన్వీనర్ హరికుమార్, వేశాలమ్మ ఆలయ చైర్మన్ కొత్తపల్లి విజయ్‌కుమార్, మధ్య మండలి సభ్యుడు నరసింహరాజు, ఏపీ బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు హరిప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరాలు

రామచంద్రాపురం: సొరకాయలపాళెం, కమ్మపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల ఆవరణలో శనివారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఏపీ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

పల్లె చెంతకు వైద్యం

ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన వైద్య సేవలు ఇంటి ముంగిట అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేసింది. ఇందులో భాగంగా సచివాలయం పరిధిలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. ఉచితంగా వైద్య సేవలతోపాటు మందులు అందజేస్తున్నారు. తద్వారా గ్రామీణులకు వ్యయప్రయాసలు లేకుండా సేవలందుతున్నాయి. దీంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. –భాకరాపేట

- గ్రామీణుల కోసం వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు
- వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట
- ఉచితంగా వైద్యం, మందులు పంపిణీ



రక్త పరీక్షలు చేస్తున్న వైద్య బృందం (ఫైల్)

చిన్నగొట్టిగల్లు మండలంలో చిన్నగొట్టిగల్లు, జంగావాండ్లపల్లె, తిప్పిరెడ్డిగారిపల్లె, నెల్లుట్లవారిపల్లె, దిగవూరు, భాకరాపేట, టీ.చట్టేవారిపాళెం, రంగన్నగారిగడ్డ, దీన్‌దార్లపల్లె సచివాలయాల పరిధిలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు ఉన్నాయి. వీటిలో 12 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. 65 రకాల మందులు అందుబాటులో ఉంచారు. దీర్ఘకాలిక వ్యాధులైన రక్తపోటు, మధుమేహంతో బాధపడుతున్న వారికి ప్రతి నెలా పరీక్షలు నిర్వహించేందుకు పరికరాలు ఏర్పాటుచేశారు. సిబ్బంది పరీక్షలు చేసి ప్రాథమిక లక్షణాలతో ఉన్న అనుమానితుల్ని గుర్తించి వైదుల వద్దకు పంపుతారు. గుట్కా, బీడీ, సిగరెట్, మద్యం సేవించడం ద్వారా వచ్చే వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తారు. అలాగే గర్భిణులు, చిన్నారుల సంరక్షణతోపాటు నవజాత శిశువు ఆరోగ్యం, కౌమార దశలో శరీరంలో కలిగే మార్పులను వివరించి అవసరమైన వారికి వైద్య సేవలు అందిస్తున్నారు. కుటుంబ నియంత్రణ, గర్భనిరోధక, ఇతర పునరుత్పత్తి ఆరోగ్య సంరక్షణ సేవలు, అంటు వ్యాధుల నియంత్రణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంచానికే పరిమితమైన వారిని గుర్తించి ఇంటి వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నారు. మండలంలో మధుమేహం రోగులు 1069 మంది, బీపీ వ్యాధిగ్రస్తులు 1182 మంది, టీబీరోగులు ఆరుగురు, క్యాన్సర్ వ్యాధిబారిన పడిన వారు నలుగురు ఉన్నారు.

పైసా ఖర్చు లేకుండా వైద్యం



గత ప్రభుత్వంలో ఆసుపత్రికి పోవాలంటే చాలా ఇబ్బంది పడాల్సి వచ్చేది. జగన్ బిడ్డ వచ్చినాక మా ఇంటి వద్దకే డాక్టర్లు వస్తున్నారు. పరీక్షలు చేసి ఉచితంగా మందులు, మాత్రలు ఇస్తున్నారు. సలహాలు ఇచ్చి ధైర్యం చెబుతున్నారు.

–సుబ్రమణ్యం, మొరవ హరిజనవాడ

జబ్బు చేస్తే భయం భయం



గతంలో జబ్బు చేస్తే భయం భయంగా ఉండేది. ఇప్పుడు పల్లెలోనే వైద్యం అందిస్తున్నారు. చిన్న సమస్య వచ్చినా వెంటనే డాక్టర్ల వద్దకు వెళుతున్నాము. వారు పరీక్షించి మందులు ఇస్తున్నారు. అవసరమనుకుంటే ఎక్కడికి పోవాలో చెబుతున్నారు.

–వెంకట్రామయ్య, మారసానివారిపల్లె

అందుబాటులో మెరుగైన వైద్య సేవలు

ప్రభుత్వం వైద్యులను ఇంటి వద్దకే పంపి మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంది. రోగులను పరీక్షించి అవసరమైన మందులు, మాత్రలను ఉచితంగా అందజేస్తున్నాం. ఇప్పుడు జబ్బు చేసినా ప్రజలు భయపడకుండా వైద్యులు ఉన్నారని ధైర్యంగా ఉండే రోజులు వచ్చాయి.

–శశికళ, వైద్యాధికారి, పీహెచ్‌సీ, భాకరాపేట

పేదలను ఓడించేందుకు ఒక్కటైన దుష్ట చతుష్టయం



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే భూమన, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు

- ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి
- జగనన్న సురక్షలో ధ్రువీకరణ పత్రాలు పంపిణీ

తిరుపతి తుడా: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పేద ప్రజలకు జరుగుతున్న మంచిని అడ్డుకునేందుకు చంద్రబాబుతోకలిసి దుష్ట చతుష్టయం ఒక్కటైందని ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించారు. ఇందులో భాగంగానే పవన్ కళ్యాణ్, ఎల్లో మీడియా జగనన్నపై లేనిపోని ఆరోపణలు చేస్తూ అబద్ధాన్ని నిజమని నమ్మించే ప్రయత్నం చేస్తున్నట్టు దుయ్యబట్టారు. తిరుపతి నగరంలోని శ్రీకృష్ణ నగర్, ఎల్బీనగర్, చెన్నారెడ్డి కాలనీలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అర్హులకు వివిధ ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద పిల్లలు ఆంగ్ల మాధ్యమంలో చదవకూడదని చంద్రబాబు చేసిన కుట్రను విచ్ఛిన్నం చేసి ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లారని గుర్తు చేశారు. ఇచ్చిన మాటను నెరవేర్చి నాయకుడంటే ఇలా ఉండాలి అని భావితరాలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. పేద ప్రజల గురించి ఆలోచించాలంటే సహృదయం ఉండాలని, అలాంటి వారిలో ఒకే ఒక్కడు వైఎస్ జగన్ అని స్పష్టం చేశారు. తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలను అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి నగరంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసేందుకు రూ.వందల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ మాట్లాడుతూ నిరంతరం పేదల పక్షాన నిలిచి సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి అండగా నిలబడాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నరేంద్రనాథ్, ఈశ్వరి, పైడి సునీత, కో ఆప్షన్ సభ్యులు ఇమామ్ సాహెబ్, అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, డివిజన్ నాయకులు డిష్ చంద్ర, మాజీ జెడ్పీటీసీ వెంకటముని రెడ్డి పాల్గొన్నారు.

గడువులోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

తిరుపతి తుడా: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను గడువులోపు పూర్తి చేయాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత హౌసింగ్, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆమె శుక్రవారం అధికారులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ నిర్మాణాలు పూర్తయిన ఇళ్లలో ప్రవేశాలకు సిద్ధం చేయాలన్నారు. అన్ని లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. హౌసింగ్, ఇంజినీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు కాంట్రాక్టర్లను సమన్వయం చేసుకుని పనులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, ఎస్ఈ మోహన్, హౌసింగ్ పీడీ వెంకటేశ్వర్లు, మునిసిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ఆగస్ట్ 15లోపు అందుబాటులోకి ఆడిటోరియం

తిరుపతి తుడా: ఆర్ట్ స్టూడియోలో నిర్మాణంలో ఉన్న ఆడిటోరియం పనులు ఆగస్ట్ 15 లోపు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. ఆమె శుక్రవారం తుడా కార్యాలయం సమీపంలో నిర్మాణంలో ఉన్న ఆర్ట్ స్టూడియో పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీ లోపు ఆడిటోరియం పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డీఈ దేవిక, బీఎస్ఆర్ సంస్థ ప్రతినిధులు తెలిపారు.

నెలాఖరుకు శ్రీనివాస సేతు పనులు పూర్తి

తిరుపతి తుడా: శ్రీనివాస సేతు వంతెన పనులు ఈ నెలాఖరుకు పూర్తవుతాయని స్మార్ట్ సిటీ ఎండీ హరిత తెలిపారు. ఆమె శుక్రవారం అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ తిరుపతి స్మార్ట్ సిటీ నిధులు రూ.650 కోట్లతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న శ్రీనివాస సేతు పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. ప్రస్తుతం రైల్వే ఓవర్ బ్రిడ్జిపై గడ్డర్లు అమర్చుతున్నారని తెలిపారు. వారం క్రితం ఒక గడ్డర్ అమర్చామని, శుక్రవారం రెండో గడ్డర్ ఏర్పాటుచేసినట్టు తెలిపారు. మరో వారం లోపు మూడో గడ్డర్ అమరుస్తారని చెప్పారు. తర్వాత సెగ్మెంట్స్ అమర్చే పనులు పూర్తి చేస్తారని వివరించారు. ఎస్ఈ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఎస్పీ నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

దోబీ ఘాట్‌కు స్థలం కేటాయింపుపై హర్షం

– ఎమ్మెల్యేని సత్కరించిన రజక సంఘ నేతలు



ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని సత్కరిస్తున్న రజక సంఘం నేతలు, సభ్యులు

తిరుపతి కల్చరల్: తిరుపతి నగరంలోని నవోదయ, చంద్రశేఖర్‌రెడ్డి కాలనీల్లోని రజకులు వృత్తిపని చేసుకోవడానికి దోబీఘాట్‌కు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని 50 సెంట్ల స్థలం కేటాయించారు. దీంతో రజకులు శుక్రవారం గాయత్రీ రజక సహకార సేవా సంఘం, శ్రీవినాయక వీరభద్ర రజక సహకార సేవా సంఘం నాయకుల ఆధ్వర్యంలో పద్మావతిపురంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని కలిసి శాలువలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కాలనీల్లో దోబీఘాట్ లేకపోవడంతో రజకులు 10 ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోబీఘాట్‌కు స్థలం కేటాయించాలని ఏపీ రాష్ట్ర రజక జనసేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే కలెక్టర్‌తో మాట్లాడి స్థలం కేటాయించేలా చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా తిమ్మినాయుడుపాళెం సర్వే నంబర్ 84లో 50 సెంట్ల స్థలాన్ని కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో వారు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామని తెలిపారు. రజక సంఘం నేతలు కుమారస్వామి, సురేంద్ర, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రూ.70 లక్షలతో షాదీ మహల్ ఆధునికీకరణకు చర్యలు



షాదీ మహల్‌ను పరిశీలిస్తున్న అభినయరెడ్డి

తిరుపతి కల్చరల్: ఎంఆర్ పల్లిలోని షాదీ మహల్‌ను రూ.70 లక్షలతో ఆధునీకరణ చేస్తామని డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం ముస్లిం మైనారిటీ నాయకులతో కలిసి షాదీ మహల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా షాదీ మహల్‌ను ఆధునికీకరించాలని నాయకులు, మత పెద్దల విన్నవించారు. స్పందించిన డిప్యూటీ మేయర్ కౌన్సిల్‌లో ఆమోదం తెలిపి వెంటనే పనులు చేపడతామన్నారు. అంచనాలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే.బాబు, కో ఆప్షన్ సభ్యుడు ఇమామ్, కార్పొరేటర్ కోటూరు ఆంజనేయులు, మైనారిటీ కార్పొరేషన్ ఫైనాన్స్ డైరెక్టర్ ఇమ్రాన్, షాదీ మహల్ చైర్మన్ గఫూర్, ఫరీద్, గౌస్, రఫీ హిందూస్థానీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ



తిరుపతి కల్చరల్: ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఓరియంటల్ పాఠశాలలో చదివే తల్లిదండ్రులు లేని 20 మంది పిల్లలకు శుక్రవారం ఉచితంగా యూనిఫామ్ అందజేశారు. హెచ్ఎం టి.చంద్రయ్య, ట్రస్ట్ సభ్యులు సంధ్య, శ్రీలత, హైమా, శిరీష పాల్గొన్నారు.

ఆముదం విత్తనాల పంపిణీ

తిరుపతి ఎడ్యుకేషన్: ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం కేవీపల్లి, చిత్తూరు, గుర్రకొండ మండలాల రైతులకు ఆముదం సంకర రకం ఐసీహెచ్–5 విత్తనాలను సహ పరిశోధనా డైరెక్టర్ ఎస్.కలీముల్లా ఉచితంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ పందులు, కోతులు పంటలను నష్టపరిచే ప్రాంతాల్లో వేరుశనగకు బదులు సంకర ఆముదం సాగు ఉత్తమమని తెలిపారు. వీటికి మార్కెట్ సమస్య ఉండదన్నారు. సేద్య విభాగపు ప్రధాన శాస్త్రవేత్త జి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆముదం మొక్క మొదటి గెల వేసే సమయానికి దాదాపు 100 సెంటీమీటర్ల పొడవు పెరుగుతుందని తెలిపారు. మొదటి గెల సుమారు 51 సెంటీ మీటర్ల పొడవు ఉంటుందని, గింజలలో 45.48 శాతం నూనె ఉంటుందని వివరించారు. వంద గింజల బరువు 30 గ్రాములు ఉంటుందని, హెక్టారుకు 16 క్వింటాళ్ల ఉత్పత్తి వస్తుందన్నారు. ఎస్.తిరుమల రెడ్డి, బాల హుస్సేన్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

ముస్లింల అభ్యున్నతికి కృషి

తిరుపతి మంగళం: తిరుపతిలోని ముస్లిం, మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తానని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చెప్పారు. ఆయన శుక్రవారం నెహ్రూనగర్‌లోని మసీదులో ప్రార్థనలు చేశారు. ముస్లిం యువకులకు ఉర్దూ అధ్యాపకులుగా అవకాశం కల్పించాలని ముస్లింలు ఎమ్మెల్యేని కోరా రు. స్పందించిన ఎమ్మెల్యే డీఈవోతో ఫోన్‌లో మాట్లాడారు. గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, కార్పొరేటర్లు తిరుత్తణి శైలజ, తిరుపతి మునిరామిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కె. ఇమామ్, దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, పాముల రమేష్‌రెడ్డి, నైనారు శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి రూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు వల్ల శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు తిరుపతిలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు ఎస్పీడీసీఎల్ తిరుపతి డివిజన్ ఈఈ వాసుదేవరెడ్డి తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గంజాయి కేసులో ఒకరికి రిమాండ్

తిరుపతి లీగల్: గంజాయి తరలింపు కేసులో పూతలపట్టు మండలం ఎం.బండ్లపల్లికి చెందిన బి.కుమార్‌రాజాకు 14 రోజులు రిమాండ్ విధిస్తూ తిరుపతి ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరిత శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. కొంతమంది నిందితులు 2020 జూన్ 17న రామచంద్రాపురం జంక్షన్ వద్ద కారులో 36 సంచుల్లో గంజాయిని తరలిస్తూ తిరుచానూరు పోలీసులకు చిక్కారు. 9 మందిపై కేసు నమోదు చేశారు. 8వ నిందితుడు కుమార్‌రాజాను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. తిరుమలలో వివిధ నేరాలకు పాల్పడిన 30 మందికి రూ.15 వేలు జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లవోలు కోటేశ్వరరావు శుక్రవారం తిరుమల క్యాంపు కోర్టులో తీర్పు చెప్పారు.

బస్సును ఢీకొన్న బైక్

పాకాల: మండలంలోని కుక్కలపల్లి వద్ద శుక్రవారం ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన నిహాల్, రాకేష్ ద్విచక్ర వాహనంలో బెంగళూరు నుంచి తిరుపతికి దామలచెరువు చెరువు మీదుగా వెళుతున్నారు. దామలచెరువు సమీపంలోని కుక్కలపల్లి వద్ద నిలిపి ఉన్న పుంగనూరు డిపో బస్సును ఢీకొన్నారు. ఇద్దరికీ గాయాలయ్యాయి. వారిని పోలీసులు 108లో తిరుపతి రుయాకు తరలించారు. ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెడికల్ క్యాంపుల పరిశీలన

పాకాల : మండలంలో రెండో విడత నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి పేర్కొన్నారు. ఆమె శుక్రవారం దామలచెరువు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జరుగుతున్న మెడికల్ క్యాంపును సందర్శించారు. సర్పంచ్ సునిత, వైస్ సర్పంచ్ ఇమ్రాన్, ఎంపీడీఓ ప్రభాకర్, ఈఓపీఆర్డీ మాలతి, పాల్గొన్నారు.

తిరుపతి రూరల్ ఎంఆర్‌సీగా శరత్‌బాబు



తిరుపతి రూరల్: మండలం స్వచ్ఛ భారత్ మిషన్ మండల రిసోర్స్ కో–ఆర్డినేటర్(ఎంఆర్‌సీ)గా శరత్‌బాబు నియమితులయ్యారు. ఆయన గతంలో సాక్షర భారత్ మండల కో–ఆర్డినేటర్‌గా పనిచేశారు. గత ప్రభుత్వం ఈ వ్యవస్థను ఎత్తివేయడంతో రాష్ట్రంలో 489 మంది రోడ్డున పడ్డారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వారందరికీ ఎంఆర్‌సీలుగా ఉద్యోగం కల్పించారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం రెడ్డివారిపల్లి సమీపంలోని ఇసుక రీచ్ వద్ద అక్రమంగా ఇసుక తరలింపున గ్రామస్తులు అడ్డుకున్నారు. రెడ్డివారిపల్లి వద్ద ఓ ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో ఇసుక రీచ్ ఏర్పాటు చేశారు. గత నెల 20వ తేదీ నాటికి అనుమతి గడువు తీరిపోయింది. అయినా రీచ్ నుంచి ఇసుక తరలిస్తుండడంతో గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వాహనాలను అడ్డుకున్నారు. ఇసుక రీచ్‌లో పనిచేస్తున్న ముగ్గురు మైనింగ్ సిబ్బందిని పోలీసులకు అప్పగించారు. అనుమతులు పూర్తయినా తిరుపతికి చెందిన టీవీ రమణ కుమారుడు నితిన్, రాయచోటికి చెందిన సందీప్ ఇసుక అక్రమ రవాణా చేస్తూ టిప్పర్, ట్రాక్టర్ డ్రైవర్లపై దౌర్జన్యం చేస్తున్నారని చంద్రమౌళిరెడ్డి ఆరోపించారు. ఒక్కొక్క వాహనం నుంచి రూ.10 వేలు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ఎందుకు ఇవ్వాలని అడిగితే ఎస్ఈబీ ఏఎస్పీతో మాట్లాడండి అని ఫోన్ ఇస్తున్నారని పేర్కొన్నారు. గురువారం నితిన్, సందీప్ ఇసుక దందాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం చంద్రగిరి పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

భక్తులకు అన్నదానం

చంద్రగిరి(తిరుపతి రూరల్): మూలస్థానమ్మ ఆలయంలో శుక్రవారం చంద్రగిరి పట్టణానికి చెందిన కోలా రాజేంద్ర కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, రాహుకాల పూజలు చేశారు. 86 మంది మద్యం ప్రియులు అమ్మవారి ఎదుట మద్యం ముట్టమని సత్య ప్రమాణం చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

రామచంద్రాపురం: రామచంద్రాపురంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు జెండా ఎగురవేసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర మాదిగ మాట్లాడారు. కార్యక్రమంలో శివ, మురళీ, జానకిరాం, హరిప్రసాద్, అయ్యప్ప, ప్రసాద్, హేమంత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.